సాక్షి
తూర్పుగోదావరి

సోమవారం । 10 । ఫిబ్రవరి । 2025



అంతర్వేది స్వామీ... సదా స్మరామి

కల్యాణ మహోత్సవాల్లో భాగంగా అంతర్వేది లక్ష్మీనృసింహ స్వామివారికి ఆదివారం అన్నపర్వత మహా నివేదనను అత్యంత ఘనంగా నిర్వహించారు.


8లో



నాటికలకు పూర్వ వైభవం తీసుకొస్తాం

తెలుగు నాటికలకు పూర్వ వైభవం తెచ్చేందుకు ఉగాదికి తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు నిర్వహిస్తున్నామని కాటన్ కళాపరిషత్ ప్రతినిధులు తెలిపారు.

డెల్టాలకు 8,850 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 8,850 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 4,400 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.95 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): కూటమి ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని ఏపీ 104 ఎంఎంయూ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో సంఘం అధ్యక్షుడు లక్ష్మణరావు మాట్లాడుతూ 2008 నుంచి 104 ఉద్యోగులు సేవలందిస్తున్నారని చెప్పారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వేతనాలు పెంచారన్నారు. డీఈవోలకు, డ్రైవర్లకు జీతాల పెంపుదల లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్ఎఫ్‌పీ విధివిధానాలు ప్రస్తుత జీతాలు తగ్గించేలా ఉన్నాయని, తక్షణం వాటిని ఉపసంహరించుకుని, ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి చంటిబాబు, సింహాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ధూళిపాళకు నోరి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న మహాదేవమణి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): నగరానికి చెందిన ప్రముఖ పండితుడు, ప్రవచనకర్త, అవధాన గురువు ఆచార్య ధూళిపాళ మహాదేవ మణికి ఆదివారం నోరి పురస్కారం–2025 ప్రదానం చేశారు. తెలుగు, సంస్కృత భాషా సేవ చేసే పండితులకు హైదరాబాద్‌లోని నోరి నరసింహశాస్త్రి చారిటబుల్ ట్రస్ట్ గత 26 సంవత్సరాలుగా ఏటా ఈ పురస్కారం అందించి గౌరవిస్తోంది. ట్రస్ట్ అధ్యక్షుడు నోరి సుబ్రహ్మణ్యశాస్త్రి, విశ్రాంత ఐపీఎస్ అధికారి రాజీవ్ త్రివేది చేతుల మీదుగా మహాదేవమణికి ఈ పురస్కారం అందించారు. సభలో పండితులు, అవధానులు, ఆచార్యులు పాల్గొన్నారు.

మద్యం షాపుల డ్రా వాయిదా

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో గీత కులాలకు కేటాయించిన 13 మద్యం దుకాణాలకు సోమవారం జరగాల్సిన లక్కీ డ్రాను ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాయిదా వేశారు. జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి చింతాడ లావణ్య తెలిపారు. లక్కీ డ్రాకు ఎన్నికల కమిషన్ అనుమతి కోరామని, అవి రాగానే డ్రా తేదీ ప్రకటిస్తామని ఆమె పేర్కొన్నారు. జిల్లాలో 13 మద్యం షాపులకు 387 దరఖాస్తులు వచ్చిన విషయం తెలిసిందే.

'పరీక్షా పే చర్చ'ను వీక్షించాలి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఆరు నుంచి పది తరగతుల విద్యార్థులు పరీక్షా పే చర్చా కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కంది వాసుదేవరావు ప్రధానోపాధ్యాయులకు సూచించారు. పరీక్షలపై భయాన్ని తొలగించి, సానుకూల దృక్పథాన్ని కల్పించే లక్ష్యంతో సోమవారం ఉదయం 11 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి సుమారు 79 వేల మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. యూట్యూబ్, టీవీ చానళ్లలో ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం జరుగుతుందన్నారు. ప్రతి పాఠశాలలో, ప్రతి తరగతిలో ముందుగానే ఐఎఫ్‌బీలు, స్మార్ట్ టీవీలు, కంప్యూటర్లను ఉపయోగించుకొని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొనేటట్లు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమం ముగిసిన వెంటనే రెండు మూడు ఫొటోలు, మొత్తం పాల్గొన్న వారి సంఖ్యను ఎస్‌సీఈఆర్‌టీ, ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా ఇచ్చిన లింకులలో అప్‌లోడ్ చేయాలని వాసుదేవరావు ఆదేశించారు.

కోటసత్తెమ్మవారికి ప్రత్యేక పూజలు




ఏఎస్పీ సుబ్బరాజు దంపతులను సత్కరిస్తున్న ఆలయ అధికారులు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసి ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానార్చకుడు అప్పారావుశర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అమ్మవారిని జిల్లా ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకం ద్వారా రూ.1,25,920 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ, ఏసీ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు.

నామినేటెడ్ పోస్టులు

- పదవుల భర్తీపై కూటమి సర్కార్ కాలయాపన
- జాబితాలు అందినా ఆమోదంలో జాప్యం
- ఎమ్మెల్యేల సిఫారసులకే పెద్దపీట
- ఆశావహులకు అడియాసలు!



సాక్షి, రాజమహేంద్రవరం: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తోంది. ఎప్పుడెప్పుడు నామినేటెడ్ పదవులు దక్కుతాయా అని ఆశావహులు ఇప్పటికే సుదీర్ఘ కాలంగా నిరీక్షిస్తున్నారు. అయినప్పటికీ ఈ విషయంలో టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు ఎడతెగని జాప్యం చేస్తున్నారు. ఇది ఆ పార్టీ శ్రేణుల్లో ఆగ్రహావేశాలను నింపుతోంది. ఇప్పటికే రెండు విడతల్లో కొంత మందికి పదవులు ఇచ్చారు. మరికొంత మంది ఆశావహులు తమకు పదవులు ఎప్పుడు దక్కుతాయి.. అసలు భర్తీ చేస్తారా, లేదా.. చేస్తే అందులో తమకు దక్కుతుందా, లేదా.. అనే మీమాంసలో కొట్టుమిట్టాడుతున్నారు. పార్టీ కోసం శ్రమించిన నేతలకు పట్టం కడతామని చంద్రబాబు పలు సందర్భాల్లో చెప్పారు. కానీ, రెండు విడతలుగా పదవుల భర్తీలో ఆయా ఎమ్మెల్యేల సిఫారసులకే ప్రాధాన్యం ఇచ్చారు. ఐవీఆర్ఎస్ సర్వే, మంత్రులు, ఇన్‌చార్జిల సిఫారసులంటూ హడావుడి చేసి చివరకు చినబాబు స్క్రిప్ట్ ప్రకారం పదవులు కట్టబెట్టారు. ఫలితంగా సార్వత్రిక ఎన్నికల్లో కూటమి నేతల కోసం ఎమ్మెల్యే సీట్లు త్యాగం చేసిన వారికి భంగపాటు తప్పలేదు. ఈ పరిణామం టీడీపీ, జనసేన, బీజేపీ సీనియర్ నేతలను తీవ్ర అసంతృప్తికి గురి చేస్తోంది.

ఎడతెగని నిరీక్షణ?

అధికారంలోకి వచ్చిన వెంటనే నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. దీనిపై ఎమ్మెల్యేల సిఫారసులు, జాబితాలు కూడా తీసుకున్నారు. తీరా చూస్తే నెలలు గడుస్తున్నా నేడు, రేపు, అతి త్వరలో అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప ముహూర్తం మాత్రం పెట్టడం లేదు. దీంతో, పదవుల కోసం ఇంకెన్నాళ్లు వేచి చూడాలని ఆశావహులు అసహనానికి గురవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు, ఏఎంసీ చైర్మన్లు 6, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్లతో పాటు ఇతర స్టేట్ డైరెక్టర్ పోస్టులు ఖాళీ అయి నెలలు గడుస్తున్నాయి. రాష్ట్ర స్థాయి పదవుల విషయం అటుంచితే జిల్లా స్థాయిలోనైనా భర్తీ చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. దీనికి తోడు గత రెండు విడతల్లోనూ జనసేన, బీజేపీ నేతలు పలువురికి ఆశాభంగమే ఎదురైంది. తాజా భర్తీలో తమకు న్యాయం చేయాలని వారు బలంగా కోరుతున్నారు. అన్ని సామాజిక వర్గాల నుంచీ నేతలు పదవుల కోసం అధిష్టానానికి వందలాదిగా దరఖాస్తులు పంపారు. వాటిని ఫిల్టర్ చేసి, ప్రకటించడంలో అధిష్టానం నాన్చుడు ధోరణి అవలంబిస్తుండటంతో కార్యకర్తలు, నాయకులు సహనం కోల్పోతున్నారు. కష్టపడిన వారికి పదవులు దక్కే పరిస్థితి కనిపించడం లేదని విమర్శిస్తున్నారు.

రాజమహేంద్రవరం నగరంలో..

నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారి సంఖ్య రాజమహేంద్రవరం నగరంలో అంతకంతకూ పెరుగుతోంది. మద్యం షాపులు, ఇసుక సిండికేట్‌లో భాగస్వామ్యం కల్పించిన నేతలనే నామినేటెడ్ పదవులకు ఎమ్మెల్యే సిఫారసు చేయడంతో ఆది నుంచీ పార్టీలో ఉన్న నేతలు గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. ఇదిలాగే కొనసాగితే పార్టీ నుంచి వైదొలగాలని వారు భావించినట్లు సమాచారం. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ వద్దకు ఈ పంచాయితీ వెళ్లినట్లు తెలిసింది. పార్టీ కోసం కృషి చేసిన వారికి ఎందుకు అన్యాయం చేస్తున్నారని వారు ఎమ్మెల్యేను ఆరా తీశారని అంటున్నారు. ఎలాంటి తొందరపాటు నిర్ణయాలూ తీసుకోవద్దని, న్యాయం చేస్తామని అసంతృప్తులకు వారు హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు. సిటీలోనే కాదు ఆయా నియోజకవర్గాల్లో సైతం ఎమ్మెల్యేలు తమ అనుయాయులు, బంధువుల పేర్లను నామినేటెడ్ పదవులకు సిఫారసు చేసినట్లు తెలిసింది.

ఆశావహులకు చుక్కెదురు

- జిల్లాలో నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న పలువురికి రెండో విడతలోనూ చుక్కెదురైంది.
- టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా గత ఎన్నికల్లో నిడదవోలు సీటును వదులుకున్న మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నేత బూరుగుపల్లి శేషారావుకు రెండో విడత నామినేటెడ్ పోస్టుల్లో నిరాశే ఎదురైంది.
- ఉండ్రాజవరం మండలానికి చెందిన మరో సీనియర్ టీడీపీ నేత గన్నమని సుబ్రహ్మణ్యానికి సైతం రెండు దశల్లోనూ స్థానం దక్కలేదు.
- **జనసేన నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జి, సినీ నిర్మాత డీవీఎస్ఎన్ ప్రసాద్ సైతం పదవి ఆశించారు. పవన్‌కు అత్యంత సన్నిహితుడినైన** తనకు కచ్చితంగా పదవి వస్తుందని ఆశపడ్డారు. ఆయనకూ రెండు విడతల్లోనూ చుక్కెదురు తప్పలేదు.
- నిడదవోలులో టీడీపీ నేత కుందుల సత్యనారాయణ సైతం నామినేటెడ్ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. పార్టీ కోసం రూ.కోట్లు ఖర్చు చేశారని, తమ నేతకు పదవి ఇవ్వకపోవడమేంటని ఆయన వర్గీయులు చంద్రబాబుపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.
- గోపాలపురం నియోజకవర్గంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జెడ్పీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు సైతం పదవి ఆశించి రెండు విడతల్లోనూ భంగపడ్డారు.
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కేఎస్ జవహర్‌కే దిక్కు లేకుండా పోయింది. కొవ్వూరు నియోజకవర్గంలో చంద్రబాబు తన సామాజికవర్గ నేతలకు అధికారం కట్టబెట్టి.. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన జవహర్‌కు అన్యాయం చేశారనే విమర్శలు వస్తున్నాయి. ఆయనకు ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవి వరిస్తుందన్న ఊహాగానాలు వెల్లువెత్తాయి. తాజాగా ఆ పదవిని సైతం ఇతరులకు కేటాయించడంతో ఇక జవహర్‌కు నామినేటెడ్ పదవి కలగానే మిగిలే అవకాశం ఉంది.
- రాజమహేంద్రవరంలో జనసేన ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడిన అత్తి సత్యనారాయణకు సైతం రెండో విడతలో నామినేటెడ్ పదవి దక్కలేదు. నగర మేయర్‌గా అవకాశం కల్పిస్తామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆయనకు హామీ ఇచ్చినా.. కార్పొరేషన్ ఎన్నికల వ్యవహారం కొలిక్కి రావడం లేదు.
- పార్టీకి చేసిన సేవలకు ప్రతిఫలంగా సీనియర్ టీడీపీ నేత గన్ని కృష్ణ కూడా నామినేటెడ్ పదవి ఆశిస్తున్నారు. కానీ, ఆయనకూ గడ్డుకాలం తప్పదని అంటున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

- గోదావరిలో దూకిన వ్యక్తి
- మృతుడు దేవరపల్లి వాసి



నాగేశ్వరరావు మృతదేహం


కొవ్వూరు: గోదావరి నదిలో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. దేవరపల్లికి చెందిన పింజెర్ల నాగేశ్వరరావు (64) ఆ గ్రామంలో చెప్పుల దుకాణం నిర్వహిస్తున్నాడు. తన వద్ద పని చేస్తున్న యువకుడు వినోద్‌తో కలసి ఆదివారం రాజమహేంద్రవరం వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రోడ్డు కం రైల్వే వంతెనపై ఆగి, వీడియో తీయాలని వినోద్‌ను అడిగాడు. అదే సమయంలో హఠాత్తుగా నదిలో దూకాడు. ఎక్కువ లోతు లేకపోవడంతో నీటిలో తేలుతున్న నాగేశ్వరరావును జాలర్లు రక్షించి బోటులో రాజమహేంద్రవరం తీసుకుని వెళ్లారు. అప్పటికే నీళ్లు తాగి స్పృహ కోల్పోయిన నాగేశ్వరరావును పరీక్షించి మృతి చెందినట్లు 108 సిబ్బంది నిర్ధారించారు. అతడి భార్య రెండేళ్ల క్రితమే మృతి చెందింది. వారికి వివాహమైన ఇద్దరు కుమార్తెలున్నారు. నాగేశ్వరరావు రెండు నెలల క్రితమే పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, ఆసుపత్రిలో చికిత్స పొందాడు. అతడి ఆత్మహత్యపై పట్టణ ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు కేసు నమోదు చేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే నాగేశ్వరరావు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆయన తెలిపారు.

విమానం ఎమర్జెన్సీ డోర్ తెరచిన ప్రయాణికుడు

మధురపూడి: విమానం ఎమర్జెన్సీ డోర్ తెరచిన ప్రయాణికుడిపై కోరుకొండ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై శ్యామ్‌సుందర్ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి ఆఖరి ఇండిగో విమానం శనివారం రాత్రి మధురపూడి విమానాశ్రయానికి వచ్చింది. ల్యాండ్ అయిన తర్వాత రాజమహేంద్రవరానికి చెందిన ఓ ప్రయాణికుడు పొరపాటున విమానం ఎమర్జెన్సీ డోర్ తెరిచాడు. దీంతో ఏదైనా ప్రమాదం జరిగిందా అని ప్రయాణికులు ఆందోళన చెందారు. ఈ ఘటనతో వారు విమానం దిగి టెర్మినల్ భవనానికి చేరడానికి, ఆ ఫ్లైట్ తిరిగి హైదరాబాద్ వెళ్లడంలో జాప్యం జరిగింది. దీనిపై ఇండిగో విమానయాన సంస్థ మేనేజర్ శివ ఫిర్యాదు మేరకు ఎస్సై శ్యామ్ సుందర్ కేసు నమోదు చేశారు.

ముక్తితో మానవ జన్మకు సార్థకత

- డాక్టర్ ఉమర్ ఆలీషా
- వార్షిక జ్ఞాన మహాసభలు ప్రారంభం



సభలో మాట్లాడుతున్న ఉమర్ ఆలీషా

పిఠాపురం: 84 లక్షల జడజన్మల అనంతరం పొందే అరుదైన మానవ జన్మకు ముక్తి ద్వారానే సార్థకత కలుగుతుందని పిఠాపురం శ్రీ విశ్వ విజ్ఞాన విద్య, ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. పీఠంలో మూడు రోజుల పాటు నిర్వహించే పీఠం 97వ వార్షిక జ్ఞాన మహాసభలను జ్యోతి ప్రజ్వలన చేసి, ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జీవాత్మ పరమాత్మగా పరిణామం చెందే అద్భుత అవకాశం ఒక్క మానవజన్మకు మాత్రమే ఉందని అన్నారు. ముక్తి పొంది, తరించడానికి మానవునిలోని జీవాత్మ మానసిక, శారీరక వ్యవస్థల్లో ప్రేరణ కలిగిస్తుందని చెప్పారు. ధర్మ మార్గాన్ని అనుసరించడం ద్వారా మాత్రమే ముక్తి పొందుతారన్నారు. ముక్తి పొందాలంటే కోరికలు లేని స్థితికి మనిషి చేరుకోవాలని, దీనికోసం గురువును ఆశ్రయించి, ఆధ్యాత్మిక, తత్వ జ్ఞానాన్ని గ్రహించాలని సూచించారు. తమ పీఠం అందిస్తున్న జ్ఞాన, ధ్యాన, మంత్ర శక్తులతో కూడిన త్రయీ సాధన అవలంబించడం ద్వారా భుక్తి, తృప్తి, ముక్తి లభిస్తాయని తెలిపారు. మానవ జీవన పరిణామ క్రమంలో అండం పిండంగా మారే గర్భస్థ దశలో తాత్విక జీవన రసాయన తత్వం, బాల్య దశలో తాత్విక బాలవికాస తత్వం, యవ్వన దశలో యువ వికాస తత్వం, కౌమార దశలో ఆధ్యాత్మిక, తాత్విక జ్ఞానతత్వం, వృద్ధాప్యంలో భ్రాంతి తత్వం నుంచి ఈశ్వరత్వాన్ని తెలిపే తత్వాలను పీఠం బోధిస్తుందని తెలిపారు. మానవతా విలువల పరిరక్షణకు పీఠం పాటు పడుతోందని ఉమర్ ఆలీషా అన్నారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న విశ్రాంత ఐపీఎస్ అధికారి వీవీ లక్ష్మీనారాయణ, కాకినాడ జిల్లా 3వ అదనపు కోర్టు జడ్జి పి.కమలాదేవి, డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్, హుస్సేన్ షా, చింతపల్లి అమృతవల్లి, డాక్టర్ పింగళి ఆనంద్ కుమార్, కె.స్వర్ణలత, డాక్టర్ ఎస్.రాంగోపాల్ వర్మ, ఎస్ఆర్ఐ సభ్యులు టీఎస్‌వీ శ్రీనివాస్, సూర్య కుమార్, ఉషారాణి మాట్లాడుతూ, సద్గురువును ఆశ్రయించి తాత్విక జ్ఞానం గ్రహించడం ద్వారా జీవితాన్ని సుఖమయం చేసుకోవచ్చని అన్నారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్, జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ ఎల్.సుమలత, డాక్టర్ హరనాథరాజు తదితరులు పీఠాధిపతిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో పీఠం కన్వీనర్లు పేరూరి సూరిబాబు, అకుల రవితేజ, సెంట్రల్ కమిటీ సభ్యులు ఎన్‌టీవీ వర్మ, ఏవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా వీర రాఘవులు



రాఘవులుకు మద్దతుగా ఐక్యత చాటుతున్న నేతలు

కాకినాడ సిటీ: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పీడీఎఫ్ అభ్యర్థిగా దిడ్ల వీర రాఘవులు పేరును ప్రస్తుత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు ప్రకటించారు. స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో ఆదివారం జరిగిన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల ఆత్మీయ సమావేశంలో వీరరాఘవులును పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, గత 18 సంవత్సరాల శాసన మండలిలో ప్రజా సమస్యల పరిష్కారానికి పీడీఎఫ్ ఎమ్మెల్సీలు నిరంతర కృషి చేశారని అన్నారు. అదే బాటలో తాను కూడా పని చేస్తానని రాఘవులు చెప్పారు. ఉపాధ్యాయుడిగా 41 సంవత్సరాలు పని చేశానని, పట్టభద్రులందరూ తనకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యా రంగంలో సమస్యల పరిష్కారానికి రాఘవులు పని చేస్తారని అన్నారు. ఉపాధ్యాయ, ప్రజా, పెన్షనర్ల సంఘాల నేతలు మాట్లాడుతూ రాఘవులు అభ్యర్థిత్వాన్ని బలపరిచారు. కార్యక్రమంలో పలు సంఘాల నేతలు పాల్గొన్నారు.

రత్నగిరిపై భక్తజన ప్రవాహం

- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- 3 వేల వ్రతాల నిర్వహణ
- రూ.50 లక్షల ఆదాయం



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: రత్నగిరికి భక్తుల తాకిడి కొనసాగుతోంది. మాఘమాసం రెండో ఆదివారం, వివాహాల సీజన్ కావడంతో సత్యదేవుని ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రత్నగిరి, ఇతర ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న వధూవరులు, వారి బంధుమిత్రులు, ఇతర భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వ్రతాలు, పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు కార్లు, ఇతర వాహనాల్లో రావడంతో దేవస్థానంలోని పార్కింగ్ స్థలాలన్నీ నిండిపోయాయి. ఆలయం వద్ద తీవ్ర రద్దీ ఏర్పడింది. సత్యదేవుని ఉచిత దర్శనానికి గంట సమయం పట్టింది. ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది. సత్యదేవుని దర్శించిన అనంతరం భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. స్వామివారిని 40 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. స్వామివారి వ్రతాలు 3 వేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.50 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో సుమారు 5 వేల మంది భక్తులు సత్యదేవుని అన్నప్రసాదం స్వీకరించారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు వివిధ విభాగాల్లో పర్యటించి, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా రథసేవ

ఆలయ ప్రాకారంలో సత్యదేవుని రథసేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చి, టేకు రథంపై అర్చకస్వాములు సుధీర్, పవన్ వేంచేయించారు. స్వామి, అమ్మవార్లకు పూజల అనంతరం ఈఓ సుబ్బారావు దంపతులు కొబ్బరి కాయ కొట్టి రథసేవ ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల ఘోష నడుమ రథంపై ఆలయ ప్రాకారంలో మూడుసార్లు సేవ నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు నీరాజనం ఇచ్చి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు ముత్తంగి సేవ

సత్యదేవుడు, అమ్మవార్లను సోమవారం ముత్యాల కవచాల(ముత్తంగి సేవ)తో అలంకరించనున్నారు. గత ఏడాది నుంచి స్వామి, అమ్మవార్లు ప్రతి సోమవారం ముత్తంగి సేవలో, ప్రతి గురువారం ఆభరణాలు, పట్టువస్త్రాలు లేకుండా నిజరూపంలో భక్తులకు దర్శనమిస్తున్న విషయం తెలిసిందే.

ఇలా నులిమేద్దాం

- నేడు జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమం
- జిల్లాలో 4.30 లక్షల మంది పిల్లలు
- అందరికీ ఉచితంగా మాత్రల పంపిణీ



నులి పురుగులు (ఫైల్)

నిడదవోలు: జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని సోమవారం జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని ఒకటి నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలు 4.30 లక్షల మందికి ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా అందించనున్నారు. దీనికి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ చేసింది. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు, చిన్నారులకు ఈ మాత్రలు అందించనున్నారు. పొరపాటున ఎవరైనా పిల్లలు ఈ మాత్రలు వేసుకోకుంటే వారిని గుర్తించి, ఈ నెల 17న మరోసారి పంపిణీ చేస్తారు. భోజనం చేసిన తర్వాత ఈ మాత్రలను నోట్లో వేసుకుని చప్పరించాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్న పిల్లలకు ఈ మాత్రలను పౌడర్‌గా చేసి నీళ్లల్లో కలిపి తాగించాలి. నాలుగు రోజుల తర్వాత మరో మాత్ర తీసుకోవాలి. ఇలా ఆరు నెలలకోసారి వేసుకుంటే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఈ మాత్రలను ఇప్పటికే ఆయా కేంద్రాలకు పంపిణీ చేశారు.

ఇలా గుర్తించాలి

సాధారణంగా చిన్నపిల్లలు ఆహారం సరిగ్గా తీసుకోకపోవడంతో పాటు తిన్న వెంటనే మల విసర్జనకు వెళ్తారు. అలాగే, కడుపు నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తూ వారు నులి పురుగుల సమస్యతో బాధ పడుతున్నట్లు అనుమానించి, తగిన వైద్యం అందించాలి. భోజనం చేసే ముందు, మలవిసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. ప్రతి 10 మంది చిన్నారుల్లో ఏడుగురు నులి పురుగుల బారిన పడుతున్నారు.

వ్యాప్తి ఇలా..

నులి పురుగులు హెల్‌మెంత్ అనే పరాన్న జీవి జాతికి చెందినవి. వీటిని రౌండ్ వార్మ్స్, పిన్ వార్మ్స్, ఫ్లూక్స్ అనే మూడు రకాలుగా విభజించారు. రౌండ్ వార్మ్స్ పురుగులు సాధారణంగా కనిపిస్తాయి. పిన్, ఫ్లూక్స్ వార్మ్స్ పిల్లల పేగుల్లో జీవిస్తాయి. రౌండ్‌వార్మ్స్ 2 నుంచి 5 అంగుళాల పొడవు ఉంటాయి. ఇవి పెంపుడు జంతువులైన కుక్కలు, పిల్లులు, మట్టిలో ఉంటాయి. పెంపుడు జంతువులతో సన్నిహితంగా ఉండటం, కలుషిత ఆహారం, నీటి ద్వారా చిన్నారులకు సంక్రమిస్తాయి. చెప్పులు లేకుండా మట్టిలో ఆడుకున్న సమయంలో హుక్, పిన్ వార్మ్స్ లార్వాలు పిల్లల కాలి చర్మం ద్వారా రక్తంలోకి, ఊపిరితిత్తుల్లోకి చేరుతాయి. అక్కడి నుంచి శ్వాస నాళంలో చేరి పురుగులుగా వృద్ధి చెందుతాయి. అక్కడే గుడ్లు పెట్టి వ్యాప్తి చెందుతాయి. ఆ గుడ్లు మల విసర్జన సమయంలో బయటకు వచ్చి తిరిగి మట్టిలో లార్వాగా చేరుతాయి. బహిరంగ మలవిసర్జన వల్ల నులి పురుగులు వ్యాప్తి చెందుతాయి.

ఇవీ లక్షణాలు

నులి పురుగుల బారిన పడిన చిన్నారుల్లో ప్రాథమిక దశలో కాస్త జ్వరం, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తాయి. కడుపు నొప్పి, వాంతులు, ఆహారం జీర్ణం కాకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. హుక్ వార్మ్ జాతి పురుగులు చిన్న దంతాల వంటి వాటి సాయంతో పేగులు, రక్తనాళాల గోడలకు అతుక్కుని క్రమంగా రక్తం పీల్చుకుంటాయి. దీనివలన చిన్నారుల జీర్ణకోశంలో రక్తస్రావం ఏర్పడి, రక్తహీనత, పోషకాహార లోపాల వంటి సమస్యలు తలెత్తుతాయి. రక్తహీనత కలిగిన పిల్లల్లో ఆయాసం, శరీరం పాలిపోయినట్లు ఉండటం, నీరసం, మట్టి తినడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

ఏటా రెండుసార్లు..



నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడానికి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాం. బయట ఆహారం తినడం, మట్టిలో ఆడటం, కలుషిత నీరు తాగడంతో నులి పురుగులు శరీరంలో చేరుతాయి. వీటి నిర్మూలనకు తల్లిదండ్రులు ఏటా రెండుసార్లు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలి. తల్లి పాలు పట్టించడంతో పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. మంచి పోషక విలువ లున్న ఆహారాన్ని పిల్లలకు అందించాలి. గర్భిణులు కూడా ఈ మాత్రలు వేసుకోవచ్చు.

– డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి

లారీ దగ్ధం

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు సమీపాన గామన్ బ్రిడ్జిపై ఓ లారీ దగ్ధమైంది. స్థానికులు, అగ్నిమాపక అధికారుల కథనం ప్రకారం.. మిర్యాలగూడ నుంచి కాకినాడ పోర్టుకు పలుగు రాయి లోడుతో ఈ లారీ వెళ్తుంది. గోదావరి నదిపై ఉన్న గామన్ బ్రిడ్జి పైకి చేరుకునేసరికి లారీ వెనుక భాగంలో మంటలు రావడం మొదలైంది. వెనుక వస్తున్న లారీ డ్రైవర్ దీనిని గమనించి అప్రమత్తం చేశాడు. దీంతో ప్రమాదానికి గురైన లారా డ్రైవర్ లోడంకి శ్రీశైలం వెంటనే కిందకు దిగిపోయాడు. ప్రమాదంపై జిల్లా అగ్నిమాపక అధికారి లూథర్‌కింగ్‌కు అందిన సమాచారం మేరకు సహాయ అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ రాజమహేంద్రవరం, కొవ్వూరు అగ్నిమాపక వాహనాలతో సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో లారీ క్యాబిన్, 16 టైర్లు, ఇంజిన్ మొత్తం కాలిపోయాయి. సుమారు రూ.10 లక్షల నష్టం సంభవించింది. లారీ బ్యాటరీ వద్ద షార్ట్ సర్క్యూట్ వలన ఈ అగ్నిప్రమాదం సంభవించిందని చెప్పారు.



లారీలో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

గొల్లపాలెంలో మహిళపై దాడి



గొల్లపాలెంలో గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో గాయపడిన మంగేశ్వరి

మలికిపురం: మండలంలోని గొల్లపాలెంలో మేడిశెట్టి మంగేశ్వరిపై లక్కవరం గ్రామానికి చెందిన గుర్తు తెలియని వ్యక్తులు అమానుషంగా దాడి చేశారు. స్థల వివాదం నేపథ్యంలో ఈ దాడి జరిగింది. ఆకస్మాత్తుగా వచ్చిన సుమారు 25 మంది లక్కవరం గ్రామానికి చెందిన వ్యక్తులు తనపై దాడి చేసి తన స్థలంలో ఆస్తులను ధ్వంసం చేశారని ఆమె పేర్కొంది. ఈ మేరకు మలికిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆదివారం మంగేశ్వరి తెలిపింది. కొన్నేళ్ల కిందట తాను కొనుగోలు చేసిన స్థలం ఇప్పుడు తమ దని తనపై దాడికి పాల్పడ్డారని మంగేశ్వరి ఫిర్యాదులో పేర్కొన్నారు. మహిళనని కూడా చూడకుండా తనపై విచక్షణా రహితంగా దాడి చేశారన్నారు. దీనిపై మలికిపురం ఎస్సై పీవీవీ సురేష్‌ను వివరణ కోరగా ఈ ఘటనపై విచారణ చేస్తున్నామన్నారు.

పోలవరం కుడి కాలువలో మృత కోళ్లు



కాలువలో కోళ్లనుతొలగించి గోతిలో పూడ్చిపెడుతున్న పారిశుధ్య కార్మికులు

నల్లజర్ల: అచ్చన్నపాలెంలో ఓ కోళ్లఫారంలో వైరస్‌తో మృతి చెందిన కోళ్లను రెండు రోజుల కిందట పోలవరం కుడి కాలువలో పడేశారు. వాటి దుర్గంధంపై అటుగా వెళ్తున్న రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. శనివారం ఆ కోళ్లపై గ్రామ పంచాయతీ వారు బ్లీచింగ్ చల్లారు. అయినా ఎటువంటి ప్రయోజనం లేకపోవడంతో ఎంపీడీఓ సింహాద్రి ఆదివారం ఆ ప్రాంతానికి వెళ్లి ఆ కోళ్లు ఏ ఫారం నుంచి వచ్చాయనే విషయమై విచారణ చేపట్టారు. పశుసంవర్ధక శాఖ సిబ్బందిని పిలిచి కోళ్ల మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య కార్మికులతో కాలువలో పడేసిన కోళ్లను తీసి గోతిలో పూడ్చిపెట్టారు.

అంతర్వేది స్వామీ.. సదా స్మరామి



గజ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం

- లక్ష్మీనృసింహునికి అన్నపర్వత మహానివేదన
- గజ, పొన్నవాహనాలపై గ్రామోత్సవాలు



పారాయణలో పాల్గొన్న మహిళలు



లక్ష్మీనృసింహునికి నివేదించిన అన్నపర్వతం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆరో రోజు ఆదివారం ద్వాదశిని పురస్కరించుకుని స్వామివారికి అన్నపర్వత మహా నివేదనను అత్యంత ఘనంగా నిర్వహించారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలమూరు వారి సత్రం నిర్వాహకులు ఇచ్చిన బియ్యంతో అన్నం వండి, రాత్రి 7 గంటలకు స్వామివారి మూలవిరాట్ ఎదురుగా ఉన్న మండపంలో అర్చకులు అన్నం పర్వతంగా పోశారు. పప్పు, పులుసు, రెండు రకాల కూరలు, పెరుగు, నెయ్యి, బూరెలతో స్వామివారికి ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యంలో స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకస్వాములు మహానివేదన సమర్పించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు చేశారు. అన్నపర్వతంలోని కొంత భాగాన్ని భక్తులందరికీ ప్రసాదంగా పంచారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా, కలిదిండి కుమార రామగోపాలరాజా బహదూర్, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ పాల్గొన్నారు.

గజ, పొన్న వాహనాలపై గ్రామోత్సవం

సాయంత్రం 4 గంటలకు గజ వాహనంపై, రాత్రి 8 గంటలకు పొన్న వాహనంపైన శ్రీస్వామివారి గ్రామోత్సవాలు అర్చకులు నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు స్వామివారు దర్శనమిచ్చారు. తొలుత ఆలయం వద్ద నుంచి పల్లకిలో స్వామి, అమ్మవార్లను అలంకార మండపానికి తోడ్కొని వచ్చారు. మండపంలో స్వామిని పూలతో అలంకరించి విశేష పూజలు చేశారు. వాహనాల వద్ద ప్రముఖులు, అర్చకులు కొబ్బరి కాయలు కొట్టిన అనంతరం గ్రామోత్సవానికి స్వామిని తీసుకువెళ్లారు. కాగా శ్రీస్వామివారి సన్నిధిని శుద్ధి చేసి అన్నపర్వత నివేదన నిమిత్తం సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ భక్తులకు దర్శనాన్ని నిలిపి వేశారు. అన్నపర్వత మహానివేదన అనంతరం యథావిధిగా దర్శన భాగ్యాన్ని దేవస్థానం కల్పించింది.

సహస్రనామ స్తోత్ర పారాయణ

ఆలయంలో లలితా సహస్ర నామ స్తోత్ర పారాయణ వైభవంగా జరిగింది. జిల్లాలోని నలుమూలల నుంచి వేలాది మంది మహిళలు హాజరై పారాయణలో పాల్గొన్నారు. రెండు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ కార్యక్రమం జరిగింది. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఆలయ ఏసీ వి.సత్యనారాయణ, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేదిలో నేడు...

శ్రీస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఏడో రోజు సోమవారం వేకువ జామున 4 గంటల నుంచి 5–30 గంటల వరకూ సుప్రభాతసేవ, శ్రీస్వామివారి తిరువారాధన, శ్రీస్వామివారి అలంకరణ, బాలభోగం, అనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలు, సాయంత్రం 4 గంటలకు హనుమద్వాహనంపై, రాత్రి 7గంటలకు సింహవాహనంపై శ్రీస్వామివారి గ్రామోత్సవాలను నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు సదస్యం, 6.30 గంటలకు ధూపసేవ చేయనున్నారు.

జాతీయ క్రీడలకు న్యాయనిర్ణేతగా సతీష్



నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానిలో ఈ నెల 9 నుంచి 13 వరకూ జరిగే జాతీయ స్థాయి ఫెన్సింగ్ క్రీడలకు న్యాయనిర్ణేతగా ఏపీ నుంచి జిల్లాకు చెందిన నాగం సతీష్ నియమితులయ్యారు. ఈ మేరకు టోర్నమెంట్ డైరెక్టర్ భరత్ ఠాగూర్ నుంచి నియామక పత్రాలు అందుకున్నారు. జాతీయ క్రీడల్లో సబ్రి విభాగంలో న్యాయ నిర్ణయాలు చెప్పడంతో నిపుణులుగా సతీష్ పేరొందారు. గుజరాత్‌లో జరిగిన 36వ జాతీయ క్రీడలు, గోవాలో జరిగిన 37వ జాతీయ క్రీడల్లో కూడా సతీష్ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. జాతీయ క్రీడలకు ఫెన్సింగ్ విభాగంలో న్యాయ నిర్ణేతగా నియమితులైన తనను మంత్రి కందుల దుర్గేష్ అభినందించినట్లు సతీష్ ఆదివారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న ఆరు నెలల పాప

దేవరపల్లి: దేవరపల్లి వద్ద గుండుగొలను- కొవ్వూరు జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. దేవరపల్లి మండలం సంగాయగూడేనికి చెందిన గొర్రె కేశవ, రాణి దంపతులతో పాటు ముగ్గురు పిల్లలను బైక్‌పై తీసుకుని తాళ్లపూడి మండలం రాగోలుపల్లి వెళుతున్నారు. దేవరపల్లి వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవే సమీపంలో గుండుగొలను-కొవ్వూరు హైవేపై బైక్ అదుపు తప్పడంతో బైక్‌పై ఉన్న ఐదుగురు ప్రమాదవశాత్తూ కింద పడిపోయారు. కేశవ, రాణి దంపతులు, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు గాయపడ్డారు. ఇందులో ఒక కుమార్తెకు ఆరు నెలలు. కేశవ, రాణి దంపతులు, ఆరు నెలల కుమార్తె తీవ్రంగా గాయపడగా రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

పెదపూడి: పురుగు (గడ్డి) మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందినట్లు అనపర్తి ఎస్సై శ్రీను నాయక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. అనపర్తికి చెందిన తమలంపూడి వెంకట సాయికేతన్‌రెడ్డి (29) మానసిక పరిస్థితి బాగోలేదు. దీంతో అతను ఈ నెల 8న అనపర్తి మండలం దుప్పలపూడిలో సొంత కోళ్లఫారం వద్ద పురుగు మందు తాగాడు. వెంటనే అతన్ని రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు అతని తండ్రి సత్యనారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

యువకుడి ఆత్మహత్య

సీతానగరం: మండలంలోని ముగ్గళ్లకు చెందిన బంటుపల్లి రాజేష్ (25) చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్సై డి.రామ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. అవివాహితుడైన రాజేష్ తల్లిదండ్రులు కొన్నేళ్ల కింద చనిపోయారు. అనారోగ్యంతో ఇంటి వద్ద ఉంటూ రాజేష్ మందులు వాడుతున్నాడు. తనకు తల్లిదండ్రులు లేరని, అనారోగ్య సమస్యతో ఉండటంతో మనస్తాపం చెంది ముగ్గళ్ల శివారు పంట పొలం వద్ద చెట్టుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం 8 గంటలకు రైతులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి చిన్నాన్న షేక్ మస్తాన్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

పిఠాపురం: కొత్తపల్లి మండలం వాకతిప్పకు చెందిన మిరియాల శ్రీనివాస్ శనివారం ప్రమాదవశాత్తూ మృతి చెందిన సంఘటనపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీనివాస్ గత 20 ఏళ్లుగా గొల్లప్రోలు మండల ఏపీఈపీడీసీఎల్ సంస్థలో స్పాట్ బిల్లింగ్ రీడర్‌గా పనిచేస్తూ చేబ్రోలు, వన్నెపూడి గ్రామాల్లో విద్యుత్తు బిల్లులు తీస్తున్నాడు. శనివారం డ్యూటీకి వచ్చిన అతను చేబ్రోలు రథంబాటలో రెండంతస్తుల డాబాలో కరెంట్ బిల్లు తీయడానికి మెట్లు ఎక్కుతూ కాలుజారి కింద పడిపోయాడు. దీంతో అతని తలకు, శరీరంపై అక్కడక్కడ రక్తపు గాయాలయ్యాయి. అతనిని చికిత్స కోసం కాకినాడలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని రెండో అన్నయ్య మిరియాల పార్వతి రాజు ఫిర్యాదుపై గొల్లప్రోలు ఎస్సై ఎస్.రామకృష్ణ కేసు నమోదు చేశారు.

రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పతకాలు



రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పతకాలు పొందిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): అనంతపురం జిల్లాలోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో శని, ఆదివారాల్లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి చాంపియన్ షిప్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి 500 మంది, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 29 మంది పాల్గొన్నారు. 30 నుంచి ఏళ్ల వయసు విభాగం వారికి నిర్వహించిన పోటీల్లో 32 గోల్డ్, 12 సిల్వర్, 8 బ్రాంజ్ మెడల్స్ సాధించడంతో పాటు మార్చ్ ఫాస్ట్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా కీర్తిని ఇనుమడింపజేశారు. ఈ సందర్భంగా మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో 52 మెడల్స్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా క్రీడాకారులు అందుకోవడం జిల్లాకు గర్వకారణం అన్నారు. వర్ధమాన క్రీడాకారులు వీరిని ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో రాణించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులను డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్, మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘ కార్యదర్శి ఎం.బాపిరాజు, రాష్ట్ర పీఈటీ సంఘ అధ్యక్షుడు ఎల్.జార్జి, ఒలింపిక్ సంఘ రాష్ట్ర సీఈఓ చంద్రు గోవింద రాజు, ఒలింపిక్ సంఘ చీఫ్ ప్యాట్రన్ కర్రి భామి రెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కార్యదర్శి జి.ఎలీషాబాబు, కాకినాడ సీపోర్ట్సు సీఈఓ మురళీధర్, హరీష్ స్పోర్ట్స్ నిర్వాహకుడు హరీష్ అభినందించారు.

రూ.లక్షలు చెల్లించినా జరగని రిజిస్ట్రేషన్లు

- అమలాపురంలో బిల్డర్ మోసం చేశాడని బాధితుల ఆరోపణ
- డబ్బులు తీసుకుని పత్తా లేకుండా పోయాడని వెల్లడి
- రూ.2 కోట్ల మేర చెల్లించి మోసపోయామని ఆవేదన



అపార్ట్‌మెంట్ పార్టనర్‌ను నిలదీస్తున్న బాధితులు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ శివారు విత్తనాల వారి కాలువ గట్టు ప్రాంతంలో నిర్మించిన ఓ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ల కొనుగోలుకు బిల్డర్‌కు రూ.లక్షల్లో చెల్లించినా రెండేళ్ల నుంచి రిజిస్ట్రేషన్లు చేయడం లేదని బాధితులు ఆందోళనకు గురవుతున్నారు. జీఎస్ఆర్ ఫార్చ్యూన్ హైట్స్ పేరుతో నిర్మించిన ఈ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్లు కొనుగోలు చేసిన కొంతమంది ఓ భాగస్వామి గుత్తుల శ్రీనివాసరావుకు రూ.30 లక్షల చొప్పున చెల్లించారు. అప్పట్లో నమ్మకంతో ఇచ్చినా నేటికీ ఫ్లాట్‌లకు రిజిస్ట్రేషన్లు చేయకపోవడంతో తాడోపేడో తేల్చుకోవాలని కొనుగోలుదారులు వేచిచూస్తున్నారు. కొన్ని ఫ్లాట్ల పనులు ఇంకా చేపట్టాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో అపార్ట్‌మెంట్ నిర్మాణంలో మరో భాగస్వామి రామ్‌కుమార్‌ను ఆదివారం పిలిపించి బాధితులు నిలదీశారు. తమ సొమ్ము తీసుకుని శ్రీనివాసరావు పత్తా లేకుండా పోయాడని, ఫోన్లు చేస్తే స్పందించడం లేదని, ఫోన్లు ఎత్తినా రిజిస్ట్రేషన్లు అదిగో ఇదిగో అంటూ కాలక్షేపం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తామంతా రూ.2 కోట్ల మేర ఫ్లాట్ల కోసం చెల్లించామని చెప్పారు. ఆ డబ్బులకు సమాధానం చెప్పడం లేదని, రిజిస్ట్రేషన్లు, పనులు పూర్తి చేయడం లేదని ధ్వజమెత్తారు. రిజిస్ట్రేషన్ల బాధ్యత తనది కాదని, శ్రీనివాసరావుతోనే చేయించుకోవాలని, ఫ్లాట్లలో మిగిలి ఉన్న పనులను మాత్రం తాను పూర్తి చేస్తానని రామ్‌కుమార్ చెప్పారు. తాము ఫ్లాట్లు కొనుగోలు చేసి డబ్బులు ఇచ్చినప్పుడు బిల్డర్ శ్రీనివాసరావు ఏ పనీ సక్రమంగా చేయలేదని బాధితులు గుర్తు చేశారు. పార్టనర్ గుత్తుల శ్రీనివాసరావును తీసుకు వచ్చి, రిజిస్ట్రేషన్లు చేయించుకోవాల్సిన బాధ్యత వారిదేనని రామ్‌కుమార్ చెప్పడంతో బాధితులు అతడి కోసం అన్వేషిస్తున్నారు. రెండేళ్లవుతున్నా రిజిస్ట్రేషన్లు కాకపోవడం, పార్టనర్ శ్రీనివాసరావు స్పందించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



బాస్కెట్‌బాల్ పోటీలను ప్రారంభించిన వంగా గీత

పిఠాపురం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీత అన్నారు. పిఠాపురంలో కొప్పన మోహనరావు, రమాదేవి స్మారక రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ విద్యార్థులు ఆటల్లో రాణిస్తున్నారంటే వారి తల్లిదండ్రులను అభినందించాలన్నారు. వారు ప్రోత్సహించడం వల్లే విద్యార్థులు క్రీడల్లో పాల్గొంటున్నారని అన్నారు. పిఠాపురంలో జాతీయ స్థాయి క్రీడాకారులున్నారని, బాస్కెట్‌బాల్ కోర్టు అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలన్నారు. వరుసగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్న జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావును ఆమె అభినందించారు. అనంతరం గీత క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు వర్దినీడి సుజాత, గండేపల్లి బాబీ, పచ్చిమళ్ల జ్యోతి, ఖలీల్‌షా, పెదపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాలీ కింద పడి యువకుడి మృతి



పండు (ఫైల్)

సీతానగరం: బొబ్బిల్లంక వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. చినకొండేపూడికి చెందిన దంతే ప్రసాద్ అనే పండు (24) రాజమహేంద్రవరం రూరల్ మండలం, వెంకటనగరానికి వ్యక్తిగత పనిపై బైకుపై వెళ్లి, తిరిగి వస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. పోలవరం ప్రాజెక్టు పనులకు పొక్లెయిన్లను తీసుకు వెళ్తున్న భారీ ట్రాలీని తప్పించబోయే క్రమంలో అదుపు తప్పి దాని వెనుక చక్రాల్లో పడిపోయాడు. ఆ చక్రాలు అతని తలపై నుంచి వెళ్లడంతో తల నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు. తల్లిదండ్రులు, ఇద్దరు అన్నయ్యలు ఉన్నారు.

నాటికలకు పూర్వ వైభవం తీసుకొస్తాం



వివరాలు వెల్లడిస్తున్న సీఆర్‌సీ కాటన్ కళాపరిషత్ కన్వీనర్ గొలుగూరి వెంకటరెడ్డి తదితరులు

రావులపాలెం: తెలుగు నాటికలకు పూర్వ వైభవం తీసుకురావాలనే లక్ష్యంతో ఉగాదికి కాస్మోపాలిటన్ రిక్రియేషన్ క్లబ్ (సీఆర్‌సీ) కాటన్ కళా పరిషత్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో 25 ఏళ్లుగా నాటిక పోటీలను నిర్వహిస్తున్నట్లు కళాపరిషత్ కన్వీనర్ గొలుగూరి వెంకటరెడ్డి, సీఆర్‌సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, కళాపరిషత్ డైరెక్టర్ కె.సూర్య, సీఆర్‌సీ సెక్రటరీ కర్రి అశోక్‌రెడ్డి తెలిపారు. స్థానిక సీఆర్‌సీ ఓల్డేజ్ హోమ్‌లోని మీటింగ్ హాలులో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 25వ ఉగాది నాటికల పోటీలకు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 50 నాటికలను చూసి ఏడు నాటికలను ఎంపిక చేశారన్నారు. మార్చి నెల 30, 31, ఏప్రిల్ 1 తేదీల్లో ఉగాది సందర్భంగా మూడు రోజులపాటు ఈ నాటికలను ప్రదర్శిస్తామన్నారు. గుంటూరు అమరావతి ఆర్ట్స్ వారి చిగురు మేఘం నాటిక, హైదరాబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ వారి స్వేచ్ఛ నాటిక, విజయవాడ మైత్రి కళా నిలయం వారి బ్రహ్మ స్వరూపం నాటిక, కొలకలూరు శ్రీసాయి ఆర్ట్స్ వారి జనరల్ బోగీలు నాటిక, హైదరాబాద్ మిత్ర క్రియేషన్స్ వారి ఇది రహదారి కాదు నాటిక, తాడేపల్లి అరవింద ఆర్ట్స్ వారి విడాకులు కావాలి నాటిక, ద్రోణాదుల సహృదయ ఆర్ట్స్ వారి వర్క్ ఫ్రం హోం నాటికలు, అలాగే సీఆర్‌సీ ప్రత్యేక ప్రదర్శన నాటిక ఈ మూడు రోజుల్లో ప్రదర్శిస్తారన్నారు. సీఆర్‌సీ ప్రత్యేక ప్రదర్శన నాటికను కళాపరిషత్ కన్వీనర్ విక్టరీ వెంకటరెడ్డి స్వీయ రచన, నేతృత్వంలో జరుగుతుందన్నారు. నాటిక పోటీల ప్రారంభ కార్యక్రమానికి సినీ ప్రముఖులు, కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు తనికెళ్ల భరణి తదితరులు హాజరవుతారన్నారు. ఉత్తమ ప్రథమ ప్రదర్శనకు రూ. లక్ష, ఉత్తమ ద్వితీయ ప్రదర్శనకు రూ. 75 వేలు, ఉత్తమ తృతీయ ప్రదర్శనకు రూ. 50 వేల చొప్పున పారితోషకం ఇస్తామని తెలిపారు. సమావేశంలో సీఆర్‌సీ ఉపాధ్యక్షుడు చిన్నం తేజరెడ్డి, డైరెక్టర్లు మల్లిడి అంజనీకుమార్ రెడ్డి, చిర్ల కనికిరెడ్డి, కొవ్వూరి నరేష్‌కుమార్ రెడ్డి, పీఎస్ఎస్ రెడ్డి, నడింపల్లి సుబ్బరాజు, పలివెల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రధాని ‘పరీక్ష పే చర్చ’ కార్యక్రమం

- ఉదయం 11 గంటలకు ప్రారంభం
- విద్యార్థులు వీక్షించేలా విద్యాశాఖ ఏర్పాట్లు



రాయవరం: తనతో నేరుగా మాట్లాడేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ఒక చక్కని అవకాశాన్ని ప్రధాని మోదీ కల్పించారు. దీనికిగాను ప్రధానమంత్రి ‘పరీక్ష పే చర్చ’ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సిందిగా కేంద్ర మానవ వనరుల శాఖ పిలుపు ఇచ్చింది. ఇందులో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ‘పరీక్ష పే చర్చ’ 8వ ఎడిషన్ సోమవారం నిర్వహించనున్నారు. దేశ వ్యాప్తంగా బోర్డు పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులతో ప్రధానమంత్రి మోదీ ఉదయం 11 గంటలకు నేరుగా సంభాషిస్తారు. పరీక్షలను సమర్థవంతంగా ఒత్తిడి లేకుండా ఎదుర్కోవడం, చిరునవ్వుతో పరీక్షలకు సమాధానాలు రాయడం ద్వారా పరీక్షలంటే భయాన్ని తొలగించేందుకు ప్రధానంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎలా సన్నద్ధమవ్వాలి.. సవాళ్లను ఎలా అధిగమించాలి? విద్యార్థుల ఆకాంక్షలు ఏంటి? వాటిని చేరుకోవడానికి అనుసరించాల్సిన మార్గాలు.. పరీక్షల సమయంలో విద్యార్థులు ప్రశాంతంగా.. ఎలా ఉండాలి? ఇలా పలు అంశాలపై ‘పరీక్షా పే చర్చా’ కార్యక్రమం జరుగుతుంది. దీనిద్వారా ప్రధానమంత్రి శక్తివంతమైన యువతతో కనెక్ట్ అవుతారు. యువతతో మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకోనున్నారు. యువత ఎదుర్కొనే సవాళ్లు, ఆకాంక్షలను మరింతగా అర్థం చేసుకోవడానికి ఒక అవకాశం కూడా కలుగుతుంది. పరీక్ష పే చర్చలో ఎంపికైన సుమారు 2,050 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు విద్యా మంత్రిత్వ శాఖ ద్వారా పీపీసీ కిట్‌లను బహుమతిగా అందజేస్తారు. ఈ కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన వారు నేరుగా ప్రధానమంత్రిని కలుసుకునే అవకాశాన్ని పొందుతారు. ప్రతి విజేతకు ప్రత్యేక పరీక్షా పే చర్చా కిట్, ప్రత్యేకంగా రూపొందించిన ప్రశంసా పత్రాన్ని, ప్రధానమంత్రి ఆటోగ్రాఫ్‌ను, ఫొటోతో కూడిన డిజిటల్ సావనీర్‌ను అందజేస్తారు.

ఆత్మస్థైర్యం పెరిగేలా..



విద్యార్థుల్లో పరీక్షలంటే భయం పోయేందుకు, వారిలో ఆత్మస్థైర్యం పెంచేందుకు ఈ కార్యక్రమం ఉపకరిస్తుంది. పరీక్ష పే చర్చా కార్యక్రమాన్ని వీక్షించేలా పాఠశాలలో అవసరమైన ఏర్పాట్లు చేయాలి. ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు కార్యక్రమం విజయవంతమయ్యే విధంగా పర్యవేక్షించాలి.

– డాక్టర్ షేక్ సలీం బాషా, జిల్లా విద్యాశాఖాధికారి, అమలాపురం

ఎక్కడ చూడాలంటే..

ప్రధానమంత్రి పరీక్షా పే చర్చా కార్యక్రమాన్ని పాఠశాలల్లో విద్యార్థులంతా వీక్షించేలా ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖ ఆదేశించింది. ఇప్పటికే జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులకు అందుబాటులో ఉన్న ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీల ద్వారా కార్యక్రమాన్ని విద్యార్థులు వీక్షించాల్సి ఉంటుంది. జిల్లాలో 264 ప్రాథమిక పాఠశాలలకు స్మార్ట్ టీవీలు, 142 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానల్స్‌ను అందజేశారు.

వీటి సహాయంతో ప్రధానమంత్రి పరీక్షా పే చర్చా కార్యక్రమాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు వీక్షించేలా చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా ఆదేశించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అవసరమైన చర్యలు https://www.youtube.com/watch?v=G5UhdwmEEls లింక్‌ల ద్వారా ప్రధానమంత్రి పరీక్ష పే చర్చా కార్యక్రమాన్ని వీక్షించాలి.